దాళ్వా సాగు ఆశాజనకం

- కోతలకు సిద్ధం
- దిగుబడిపై అన్నదాతల ఆశలు


మొగల్తూరులో కోతకు సిద్ధమైన చేను

మొగల్తూరు: కష్టపడి వరి సాగు చేసిన రైతులు దిగుబడిపై వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పోత్సాహంతో పాటు ప్రకృతి కూడా సహకరించడంతో దిగిబడి బాగుంటుందని అంచనా వేస్తున్నారు. వరిసాగు ఆలస్యంగా చేపట్టినా సాగు నీరు సక్రమంగా అందడంతో పాటు వంతుల వారీ విధానం ప్రవేశపెట్టడంతో ప్రతీ శివారు ప్రాంతానికి సాగు నీరందింది. నియోజకవర్గంలోని నరసాపురం మండలంలో 9255 ఎకరాలు, మొగల్తూరు మండలంలో 1182 ఎకరాల్లో సాగు చేపట్టారు. 130 రోజులకు పంట చేతికొచ్చే 1153 రకం, 140 రోజులకు పంట చేతికొచ్చే 1121 రకం విత్తనాలు వినియోగించారు.


అండగా నిలిచిన ఆర్‌బీకే సిబ్బంది

ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం చేపట్టి రైతులకు సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఆర్‌బీకే సూచించిన నాణ్యమైన విత్తనాలు వినియోగించడం, మందుల కూడా తక్కువగా ఉపయోగించారు. అంతేకాక ఫిబ్రవరి, మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలకు, పెనుగాలులకు రైతులు ఆందోళనకు గురైనా అధికారుల సూచనలతో పంట నష్టం నుంచి గట్టెక్కారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నియోజకవర్గంలో గత వారం రోజులుగా వరి మాసూళ్లప్రారంభమయ్యాయి. ప్రభుత్వం కూడా రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేసింది. మొగల్తూరు మండలంలో మొగల్తూరు 8, రామన్నపాలెంలో 2వ సచివాలయాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గతేడాదిలానే ఎక్కువ మంది రైతులు వరి కోత యంత్రాలను వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు.

మండలంలో రెండు కేంద్రాలు



వరి మాసూళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. రైతులకు అందుబాటులో ఉండే విధంగా మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. రైతులకు అవసరమయ్యే ధాన్యం సంచులను కూడా సిద్ధం చేస్తున్నాం.

– ఎం.సుజాత, ఏఓ, మొగల్తూరు

పంట ఆశాజనకంగా ఉంది



కాలువలో నీరు పుష్కలంగా ఉండడంతో పాటు వంతుల వారీ విధానంలో ప్రతీ ఎకరాకు సాగు నీరందించేలా చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చర్యలు తీసుకున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు వినియోగించడంతో అధికారుల సలహాలు, సూచనలతో దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నాం.

– గూడూరి మావుళ్ళు, నవుడూరుగరువు

క్లుప్తంగా

పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


రాజేశ్వరరావును అభినందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మండలంలోని కేపీపాలెం నార్త్ గ్రామానికి చెందిన కందులపాటి రాజేశ్వరరావును వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షునిగా నాయకులంతా ఏకగ్రీవంగా ఎంపికచేశారు. శనివారం ఆయన చీఫ్‌విప్ ప్రసాదరాజును కలవడంతో ఆయన రాజేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కత్రి ఏసుబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, గ్రామ సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ సభ్యులు డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఆర్‌ఐగా వరలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కవురు వరలక్ష్మి నియమితులయ్యారు. శనివారం కార్యాలయంలో ఆర్‌ఐ త్రిమూర్తులు నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన వరలక్ష్మి పదోన్నతిపై ఆర్‌ఐగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఆర్‌గా పనిచేసిన పంపన త్రిమూర్తులు పోడూరు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

రేపటి నుంచి స్వర్ణాంధ్రలో హ్యాకథాన్ సదస్సు


హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వర్ణాంధ్ర కళాశాల యాజమాన్యం

నరసాపురం రూరల్: సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ యూజింగ్ పైథాన్ అనే అంశంపై స్వర్ణాంధ్ర హ్యాకథాన్ 2K23 సదస్సు నిర్వహిస్తున్నామని చైర్మన్ కేవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కంప్యూటర్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 21 వరకూ నిర్వహించనున్న ఈ సదస్సులో విద్యార్థులు రూపొందించిన డేటాసైన్స్ అప్లికేషన్లు, వెబ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను విడుదల చేస్తామన్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

పోడూరు: రైతులంతా తప్పనిసరిగా మట్టినమూనా పరీక్షలు చేయించేలా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(వీఏఏ)లు శ్రద్ధ చూపాలని పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి చెప్పారు. పోడూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం మట్టినమూనాల సేకరణ పై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఏఈఓ ప్రియాంక పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి భూసార పరీక్షా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎంజేడీ మాధురి భూసార పరీక్ష ఆవశ్యకతను రైతులకు వివరించారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

యలమంచిలి: కలగంపూడి గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (పాత జిట్స్ కళాశాల) సమీపంలో పాడుబడిన గెస్ట్‌హౌస్‌లో పేకాడుతున్న పది మందిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.31,400 నగదు, 10 సెల్ ఫోన్లు, మూడు మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'


వడ్లవానిపాలెంలో లబ్ధిదారుడి ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్‌ను అతికిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: 'అమ్మా సీఎం జగన్ పాలన నచ్చిందా... పథకాలు సక్రమంగా అందుతున్నాయా... మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారా అని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రశ్నించడంతో అయ్.. మళ్లీ జగనే సీఎం కావాలండి' అని లబ్ధిదారులు సంతృప్తికరమైన సమాధానం వెల్లడించారు. పాలకొల్లు మండలం వడ్లవానిపాలెం శివారు పెచ్చెట్టిపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింట సర్వేలో ఆయన పాల్గొని ప్రజాభిప్రాయం సేకరించారు. లబ్ధిదారుల ఇంటికి వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ డోర్ స్టికర్‌ను అతికించారు. పెచ్చెట్టిపాలెంలో డ్రైయినేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు శ్రీనివాస్‌ను కోరారు. మురుగు బోదె పూడిపోవడంతో మురుగు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే మంచి నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని మహిళలు శ్రీనివాస్‌ను కోరారు. దీంతో ఆయన స్పందిస్తూ మురుగు బోదెను త్వరలో ప్రొక్లెయిన్ సహాయంతో పూడిక తీయించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెన్మెత్స పద్మ, జెడ్పీటీసీ సడపన గోవిందరాజుల నాయుడు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, పార్టీ నాయకులు అల్లం బుజ్జి, తమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, ఇందుకూరి దిలీప్‌కుమార్‌రాజు, కోలాటి నవీన్, సిద్దుల గాంధీ పాల్గొన్నారు.

పథకాలు అందుతున్నాయి

పాలకొల్లు అర్బన్: 'నా పేరు పెచ్చెట్టి శిరీష. నేను చింతపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. నాకు అమ్మ ఒడి పథకంలో ఆర్థిక సహకారం అందుతోంది' అని వలంటీర్ కోలాటి మునీశ్వరికి సమాధానం చెప్పింది. పాలకొల్లు మండలం వడ్లవానిపాలెం శివారు పెచ్చెట్టిపాలెంలో సర్పంచ్ పెన్మెత్స పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఇంటింట సర్వేలో వలంటీర్ అడిగిన పలు ప్రశ్నలకు శిరీష సమాధానం చెప్పింది. తాతయ్య సత్యనారాయణకు పింఛన్ అందుతోంది. అలాగే అమ్మమ్మ మసేనమ్మకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకంలో లబ్ధి చేకూరుతోంది. మళ్లీ జగన్ మావయ్యే సీఎం కావాలని కోరుకుంటున్నాం అంటూ సమాధానం చెప్పింది. లబ్ధిదారుల అనుమతితో వలంటీర్ డోర్ స్టిక్కర్ అతికించింది.

పోడూరులో..

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతీఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్యరాజు అన్నారు. జిన్నూరు పెదపేట గ్రామంలో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ పనితీరుపై ప్రజలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోగులమండ విజయాదేవి, సచివాలయ కన్వీనర్ నల్లి సత్యానందం, ఉన్నమట్ల రాజు, నల్లి రమేష్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: జగనన్నే మా భవిష్యత్-మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నాయకులు, గృహ సారధులు, కన్వీనర్లు, వలంటీర్లు శనివారం మండలంలోని 21 సచివాలయాల పరిధిలో ఇంటింటికి తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్‌లు అందిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: 'పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలంతా మరొకసారి ఆశీర్వదించాలని పెనుమర్రు సర్పంచ్ కవురు గోపి కోరారు. పెనుమర్రులో శనివారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కొందరు వితంతు మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారం వల్లే కరోన సమయంలోను, ప్రస్తుతం కుటుంబ పోషణ భారం తగ్గిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాశా సూర్యనారాయణ సచివాలయ కన్వీనర్లు బాలం ఆనంద్, సక్కా సత్యనారాయణ వార్డు సభ్యులు గుడాల సత్యపూర్ణ, పార్టీ నాయకులు కొలుకులూరి నాగవందు, సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఆచంట మండలంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. భీమలాపురం, ఆచంట రావిగుంటల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలు అభిప్రాయాలను సేకరించారు. ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు.


పెచ్చెట్టిపాలెంలో 9వ తరగతి విద్యార్థిని శిరీష నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న వలంటీర్ కోలాటి మునీశ్వరి


జిన్నూరులో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో లబ్ధిదారుడి ఇంటిగోడకు స్టిక్కర్ అంటిస్తున్న దృశ్యం


పెనుమర్రులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో లబ్ధిదారురాలికి బ్రోచర్ అందిస్తున్న సర్పంచ్ కవురు గోపి

నేడు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి సప్తాహ్నిక కల్యాణోత్సవాలు ముగియడంతో ఉదయం 10 గంటల నుంచి ఆలయం వద్ద అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ముఖదారమ్మ ఆలయంలో లక్ష మల్లెల పూజ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖదారమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాత్రి లక్ష మల్లెల పూజ కార్యక్రమం నిర్వహించారు. కడియాల శ్రీనివాసు బ్రహ్మత్వంలో బొర్రా ఆదినారాయణ దంపతులు ఈ పూజా కార్యక్రమాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారికి పూజ చేసిన పూలను మహిళలకు అందించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


పాలకొల్లు సినిమా థియేటర్లో డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు పట్టణంలో వ్యాపారస్తులకు ఫైర్ సిబ్బంది కరపత్రాలను అందజేశారు. అలాగే సినిమా థియేటర్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ప్రజలకు ఫైర్ సిబ్బంది ప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవాలి? ఎలా స్పందించాలో? డెమో ద్వారా ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఇళ్లల్లో, వ్యాపారసంస్థల్లో, ఫ్యాక్టరీల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కరపత్రాల ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవరోజైన శనివారం ఆర్‌టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, పంజా సెంటర్ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇళ్లల్లో వాడే గ్యాస్ సిలెండర్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిమాపక అధికారి పి.రామ్మూర్తి ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

గోడౌన్ల పరిశీలన

నరసాపురం రూరల్: ఈవీఎం మెషీన్లు, వీవీ ప్యాడ్‌లను భద్రపరిచేందుకు అనువైన గోడౌన్లను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం పరిశీలించారు. నరసాపురం మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలో గల ఏఎంసీ గోడౌనల్లోల సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సూర్యతేజ, తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీఓ ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

పోడూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతోనే మనదేశం, సమాజం అభివృద్ధి చెందుతాయని జైభీమ్ సేవాసమితి(జేబీఎస్ఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలాబత్తుల రాజశేఖర్, చింతా సంపత్‌లు పేర్కొన్నారు. పెనుమదం శివారు అప్పిచెరువులోని జేబీఎస్ఎస్ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రావి కృష్ణమూర్తి, గొల్ల జనార్దనరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కలగంపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ

యలమంచిలి: రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడమే కాకుండా, రైతులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించడమే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రధాన కారణమని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ చెప్పారు. కలగంపూడి గ్రామంలో 2022-23 రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంటకు 100 కిలోల ధాన్యానికి కామన్ రకానికి రూ.2040, గ్రేడ్ వన్ రకానికి రూ.2060 చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాత్తూరి విష్ణుప్రియ జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం రవికుమార్, నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, తహసీల్దార్ లక్కు నరసింహారావు, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి పాల్గొన్నారు.

సబ్‌జైల్ సందర్శన

నరసాపురం రూరల్: న్యాయవాదిని నియమించుకునే స్తోమతలేని ముద్దాయిలకు సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల న్యాయసేవాసంస్థ ఆదేశాల మేరకు ఆయన నరసాపురం సబ్‌జైలును సందర్శించి జైల్ అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, న్యాయవాది గన్నాబత్తుల శివాజీ చక్రవర్తి పాల్గొన్నారు.

మా జీవిత చరిత్ర- మా మనోగతాలు పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నరసాపురం రూరల్: మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబ రచించిన 'మా జీవిత చరిత్ర-మా మనోగతాలు' పుస్తకాన్ని శనివారం పట్టణంలోని అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పరకాల కాళికాంబ ఆమె జీవితంలోని సంఘటనలకు పుస్తక రూపం ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఇందుకూరి రామకృష్ణంరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, పితాని సత్యనారాయణ, మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ బాబ్జి, జానకిరామ్, వివిధ పార్టీల నాయకులు పీడీ రాజు, పాత్తూరి రామరాజు, నెక్కంటి సుబ్బారావు, సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి బాపూశ్రీతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల ప్రారంభం

యలమంచిలి: మేడపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను శనివారం సర్పంచ్ గంటా శాంతకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని రోజుల్లో కూలీలకు పని కల్పించడంలో ఉపాధిహామీ పనులు చక్కగా ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో తాడి ఇందిర, గుర్రాల వెంకట్రావు, దేగల సూర్యప్రభ, ముద్దల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంకలకోడేరులో

పాలకొల్లు అర్బన్: పనులు లేని వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకుని ఉపాధి పొందాలని వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరులో శనివారం ఉపాధి హామీ పథకంలో రూ.3.25 లక్షలతో చేపట్టిన భగ్గేశ్వరం మురుగు కాలువ మరమ్మతుల పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చొప్పల రజని కూనపరాజు చంటిరాజు, కర్రి జోగయ్య పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనుల ప్రారంభం

పెనుగొండ: ఆచంట కనరత్న గుంటలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం అమృత్‌సరోవర్ పథకంలో భాగంగా అంకినీడి చెరువు పూడికతీత పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పెచ్చెట్టి సత్యనారాయణ, అద్దాల సూర్యవరప్రసాద్, మణికంఠ, పద్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పోడూరు: పోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతులు, ట్రీకటింగ్ కారణంగా ఆదివారం ఉదయం 7.00గంటల నుంచి మధ్యాహ్నం 3.00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మట్టపర్రు, వేడంగి, వేడంగిపాలెం, జిన్నూరు శివారు అన్నపూర్ణమ్మపేట గ్రామాల్లో విద్యుత ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

యలమంచిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ వేగం పెంచాలని హౌసింగ్ ఈఈ వారణాసి సుబ్రహ్మణ్య సిద్ధాంతి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రజలకు ఇంటి నిర్మాణంపై అవగాహ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చినటం త్రిశూలపాణి, హౌసింగ్ ఏఈ రాజారామ్ పాల్గొన్నారు.